# ఎవరికీ  చెప్పమాక!

దుర్గాంబ హైక్లాస్ కాఫీ హోటల్ యజమాని శంకరయ్య చాలా హడావుడిగా ఫలహారాలందిస్తున్నాడు. పేరుకు శంకరయ్యే యజమాని కాని పెత్తనమంతా అతని భార్య సుబ్బమ్మది. సుబ్బమ్మది పట్నం కనుక పల్లెటూరు శంకరయ్యకి ఏమీ రాదని తీర్మానించుకుని అజమాయిషీ చేస్తుంది. తన పట్నవాసానికి రుజువుగా మాటల్లో మధ్యమధ్య ఇంగ్లీషు పదాలు వాడ్తుంది. పైగా అట్లు పోసేది తను. ఎంత మొగుడైనా అతగాడు అందించేవాడు గదా!

శంకరయ్య లోపలికొచ్చిన వాళ్ళని వరసలు పెట్టి ఆహ్వానించి కూర్చో పెడుతున్నాడు. "బావా! ఇటు కూర్చో. బావా! ఇవ్వాళ ఇంత ఆలస్యమయిందేం? ఇలా. ఇహ వరండాలోంచి వంటింట్లోకి పెట్టే కేకలిలా ఉంటాయి. "పుల్లారావుగారొచ్చారు. ఓ పెసరట్టు ..... అల్లం పచ్చి మిరప కాయలెక్కువ" "ఎల్లారావు గారికి ఉల్లిపాయట్టు రోష్టు" అని శంకరయ్య అంటుంటే పుల్లారావు, ఎల్లారావులు పొంగిపోయేవారు. లోపల సుబ్బమ్మ పెనం మీద అట్లకాడతో 'ఠాంగ్ అనికొట్టడంతో పాటు 'అట్టు రెడీ' లేక 'అట్రెడి' అంటూ తిరుగ అరిచేది. వచ్చినవాళ్ళకి తన గొంతు విన్పించటం ఆవిడకి ఓ సరదా. శంకరయ్య పరుగు పరుగున అట్లు ఆకులో వేసుకొచ్చి అందిస్తే పుల్లారావు, ఎల్లారావులు తమ పేరుమీద ప్రత్యేకంగా కాల్చిన ఆ అట్లు మురిసిపోతూ తింటుంటే అడక్కుండానే ఉప్మా వడ్డించేవాడు. చట్నీ మిగిలిపోయిందని రెండో ఉప్మా కూడా

తగిలించేవాడు. అయితే ఉప్మా మిగిలిపోతే చట్నీ మళ్ళీ వెయ్యడానికి గింజుకు చచ్చేవాడు. 'చట్నీ అయిపోతే సరుకేం జేసుకోను?' అంటూ చంచాతో విదిలించేవాడు. ప్రతి పావుగంటకీ చట్నీ రాచిప్పలో నీళ్ళు కలుపుతూ వీధిలోకి చూస్తుండేవాడు. యాత్రికులు కన్పిస్తే చెంగునవీధిలోకి గెంతి 'ఇడ్లీ, ఉప్మా, అట్టు రెడీ' అంటూ చుట్టుముట్టి వాళ్ళకి ప్రదక్షిణం చేసేవాడు.

'కొబ్బరికాయలు కొనుక్కోవాలి స్నానం చేయాలి' అని వాళ్ళంటే అదేం విన్పించుకోకుండా రామనామంలాగా "ఇడ్లీ, ఉప్మా, అట్టు రెడీ" అంటూ వాళ్ళని అడుగు ముందుకు వెయ్యనిచ్చేవాడు కాదు. "పోనీ టిఫిన్ చేసే వెళ్దాం" అనే స్థితిలో వాళ్ళని పెట్టి ముక్కుకు తాడేసి హోటల్లోకి లాక్కొచ్చేవాడు.

ఒకసారి ఓ అరడజను మంది కుర్రకారు హోటల్లో జొరబడి కావలసినంత తిని చట్నీ గురించి పేచీలేసుకుని,-లెక్క తప్పు చెప్పి కావాలని శంకరయ్యతో తగాదా పెట్టుకొన్నారు."అట్టు సైజు తగ్గింది కాబట్టి హాఫ్ రేట్" అన్నారు. "ఉప్మాలో జీడిపప్పు తగల్లేదు కనుక అసలు డబ్బులివ్వం" అన్నారు. మాట మీద మాట పెరిగింది. "పందిరి పీకేస్తాం" అన్నారు కుర్రకారు. "పీకండి చూస్తా " అని తిరగబడ్డాడు శంకరయ్య. అనటమేమి అందులో ఓ కుర్రాడు పెన్సిల్ చెక్కుకునే చాకు బయటకు తీసి బల్లమీద నిలువునా టంగ్న గుచ్చాడు. శంకరయ్యకి ముచ్చెమటలు పోశాయి. అతనికి పెళ్ళాన్ని చూసినా చాకుని చూసినా మాట పడిపోతుంది. "ఎంతో అంత ఇచ్చి వెళ్ళండయ్యా" అన్నాడు ఏడుపు ముఖంతో. కుర్రకారు వాళ్ళకి తోచింది దానమిచ్చి బయటకు వెళ్ళటమే తడవు ఇంట్లోంచి సుబ్బమ్మ పరుగెత్తుకొచ్చి మొగుణ్ని ఈ విధాన దీవించింది. "నువ్వు మొగాడివా? నువ్వు మొగుడివా? ఆ ఫైటింగ్‌గాళ్ళకు టిఫిన్ ఎందుకిచ్చావ్? ఆ బ్లడీ అట్లా అరుస్తుంటే నీ నోరేమయింది. అసలు నువ్వు ..... నువ్వు బ్లడీవి. నువ్వు ఫూలువి. నువ్వు యూస్లెస్‌వి. ఫో దుకాణం కట్టేసి కిష్ణకెళ్ళి స్నానం చేసిరా" అని తరిమేసింది.

శంకరయ్యకి పెళ్ళాం తిట్టినందుకు కాదుగాని ఇంగ్లీషులో తిట్టిందే అని బాధపడుతూ కిష్ణవొడ్డున చింతచెట్టుకింద కూర్చుంటే అక్కడపుల్లలేరుకుంటున్న

మల్లి కన్పించింది. మల్లి మంచి వయసులో ఉంది. ఉన్నట్టుండి శంకరయ్యకు మల్లి మీద మనసైంది. దగ్గరకెళ్ళి మెలికలు తిరుగుతూ 'ఏవే! ఏవేవే! రోజుకెంత సంపాయిస్తావే?'' అనడిగాడు. "ఎంతొస్తేనేం నువ్వు ఆరుస్తావా తీరుస్తావా?'' అంది మల్లి.

"హోటల్కి రావే ఉప్మా పెడ్తాను'' అన్నాడు శంకరయ్య. డబ్బు లతని దగ్గర ఎప్పుడూ ఉండవు కనుక ఆ ముక్క కరెక్ట్గానే అన్నాడు. మల్లి ఇంతెత్తున లేచి "నాకుప్మా పెడ్తావంట్రా ...... నన్ను రమ్మని పిలుస్తావంట్రా ....'' అంటూ తిట్లు లంకించుకుంది. ఆ తిట్లతో ఏడుపు కలిపింది. ఈ ఏడుపులు క్రిష్ణలో స్నానంచేస్తున్న పోలీసు చెవిన పడ్డాయి. అతగాడు వొళ్ళు తుడుచుకోకుండా పరుగెత్తికొచ్చి, తడి తుండుగుడ్డతో శంకరయ్య చేతులుకట్టేసి పోలీసుస్టేషన్కి తీసికెళ్ళాడు.

గంటసేపు కటకటాల వెనకాలనుంచి వారం రోజులపాటు తిన్నంత టిఫిన్కి వొప్పందం కుదిరాక శంకరయ్యను వొదిలేశాడు పోలీసు.

ఆ మర్నాడు ఉదయం దుకాణం కట్టేసి వీధిలో వస్తుంటే ఎవరో "శంకరయ్యా'' అని పిలిచారు. శంకరయ్య దగ్గరకెళ్ళి "రామయ్య బావా! చింతచెట్టు దగ్గర మల్లిని పలకరించాను అమ్మతోడు. నేనేం చెయ్యలా. పోలీసు తీసికెళ్ళాడు. ఓ గంట లోపలుంచి వొదిలేశాడు. నా మీదొట్టు..... ఎవరికీ చెప్పమాకు'' అని ముందుకెళ్ళాడు.

ఇంకెవరో 'ఓరి శంకరయ్య' అంటే అతని దగ్గరకెళ్ళి 'పుల్లయ్యన్నా .... చింతచెట్టు దగ్గిర ....' అంటూ తనే పాటంతాపాడి ఎవరికీ చెప్పమాకు అన్న పల్లవితో ముగించి వొట్టేయించుకున్నాడు.

అలా పిలిచిన వాళ్ళకీ, పిలవని వాళ్ళకీ తనే కథంతా చెప్పి వూరంతా చాటింపు వేయించుకున్నాడు. మర్నాటికీ విషయం సుబ్బమ్మ చెవిన పడ్డది. భద్రకాళి అయిపోయి వంటా, వడ్డనా అంతా తనే చూసుకుంటూ మొగుడిచేత వారం పాటు అంట్లు తోమించింది. అంట్లుతోముతూ శంకరయ్య ఆశ్చర్య పోయాడు "ఎవరికీచెప్పమాక''అని వొట్టు వేయించుకొన్నానే ....*